## క్లుప్తంగా

### నేడు జాతీయ లోక్ అదాలత్

**నరసాపురం:** నరసాపురం కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.వి జయదుర్గ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. లోక్అదాలత్లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. పోలీసులు, న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాజీ చేసుకోదగిన సివిల్, క్రిమినల్ అన్ని కేసులు పరిష్కరించుకోవచ్చని వివరించారు.

### అధికారులు అప్రమత్తంగా ఉండాలి



ఆచంట మండల పరిషత్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**పెనుగొండ:** అకాల వర్షాలు, వరదలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలతో పాటు అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి అన్నారు. శుక్రవారం ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సర్వ సభ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. అన్ని గ్రామాల్లోనూ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో ఆర్టీసీ బస్సులను కోడేరు వరకూ పొడిగించాలన్నారు. అభివృద్ధిలో అధికారులు అలసత్వం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, వైస్ ఎంపీపీలు ఎర్రగొప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్, ఎంపీడీవో నరసింహప్రసాద్, ఇన్చార్జి తహసీల్దారు సుగుణ సంధ్య పాల్గొన్నారు.

### కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి



ఆచంటలో ఎస్బీఐ వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

**పెనుగొండ:** ఆరుగాలం కష్టపడి సాగు చేసే కౌలు రైతుకు రుణాలు మంజూరు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. భూయజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతుకు నేరుగా రుణాలు అందించాలని కోరుతూ శుక్రవారం ఆచంట ఎస్బీఐ వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ప్రకృతి వైపరీత్యాలతో తీవ్రంగా నష్టపోతున్న కౌలు రైతులకు రుణాల ఇవ్వకుండా బ్యాంకులు నిరాశ పరుస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కేతా పుర్ణారావు, బండి శ్రీనివాస్, కేతా మోహన్రావు, కుడిపూడి విష్ణుమూర్తి, బండి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


### 150 మందికి వైద్య పరీక్షలు



పెనుమంట్రలో మెడికల్ క్యాంపులో మందులను అందజేస్తున్న దృశ్యం.

**పెనుమంట్ర:** శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం పెనుమంట్రలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. తణుకు పట్టణానికి చెందిన కేర్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ ఏకే మాధురి, డాక్టర్ భార్గవ్ రోగులను పరీక్షించి అవసరమైనవారికి ఉచితంగా మందులను అందజేశారు. శిబిరానికి 150 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో కన్వీనర్ రావు కాశీ విశ్వేశ్వరరావు మాజీ ఎంపీపీ మేడపాటి లక్ష్మి, దాత గంట మారియ్యానాయుడు, నానాజీ, వాసు, జి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వీడని ముంపు



కొత్త నవరసపురం ఎస్టీకాలనీ రోడ్లపై నిలచి ఉన్న వరద నీరు

**నరసాపురం రూరల్:** గోదావరి ఎగువ ప్రాంతంలో వరద ఉధృతి తగ్గినప్పటికీ ధవళేశ్వరం నుంచి నీరు కిందకు విడుదల కావడంతో వశిష్ట గోదావరిలో శుక్రవారం వరద ప్రవాహ ఉధృతి కనిపించింది. వరద నీరు మధ్యాహ్నం వరకూ పెద్దగ లాగకపోవడంతో కొత్తనవరసపురం ఎస్టీ కాలనీ రోడ్లపైకి చేరిన వరద నీరు లాగలేదు. తిరిగి రాత్రి నుంచి వరద తగ్గుముఖం పట్టింది. లోతట్టు ప్రాంతాలైన కొత్తనవరసపురం ఎస్టీ కాలనీలో వరద నీరు సాయంత్రం వరకూ కనిపించింది. శనివారం నాటికి పూర్తిగా వరద ముంపు తీవ్రత తగ్గుముఖం పడుతుందని ఆ ప్రాంతాల ప్రజలు పేర్కొన్నారు.

# పోషకాహారంతో మెరుగైన వ్యాధి నిరోధకశక్తి



పాలకొల్లు అర్బన్: అరట్లకట్టలో పోషణ మాసోత్సవాల్లో మాట్లాడుతున్న సీఐ జి శ్రీనివాస్



పెనుగొండ: వెంకట్రామపురంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



యలమంచిలి: కాజ తూర్పు గ్రామంలో మాట్లాడుతున్న మహ్మద్ హసీనా

**పెనుగొండ:** పోషకాహారంతో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని వెంకట్రామపురం సర్పంచ్ పిల్లి అనంతలక్ష్మి అన్నారు. శుక్రవారం వెంకట్రామపురం మల్లప్పదిబ్బలో జరిగిన అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహార విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజరు ఎం.విజయకుమారి, కార్యదర్శి కె.మోహన్, వెల్ఫేర్ అసిస్టెంట్ రోజారాణి, డబ్ల్యూపీఎస్ జి.భారతీదేవి, హెచ్ఎం అంజూరి గణేశ్వరరావు, పిల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

**అరట్లకట్టలో..**

**పాలకొల్లు అర్బన్:** విద్యార్థి దశలో కిశోర బాలికలు అధిక పోషక విలువలతో కూడిన ఆహారం భుజించాలని పాలకొల్లు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గుత్తుల శ్రీనివాస్ చెప్పారు. పాలకొల్లు మండలం అరట్లకట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ ఇందిర అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీఐ పాల్గొని మాట్లాడారు. విద్యార్థు సెల్ఫోన్కి దూరంగా ఉండాలని సూచించారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సీడీపీఓ సీహెచ్ ఇందిర మాట్లాడుతూ బాలికలు మంచి పోషక విలువలతో కూడిన ఆహారం భుజించడం వల్ల రక్తహీనత సమస్యలు తలెత్తవన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం మూర్తిరాజు, పంచాయతీ కార్యదర్శి దిడ్ల మాధవి, సూపర్వైజర్ పులఖండం సత్యవేణ, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**చిరు ధాన్యాలతో ఆరోగ్యానికి మేలు**

**యలమంచిలి:** చిరు ధాన్యాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఐసీడీఎస్ సూపర్వైజర్ మహ్మద్ హసీనా చెప్పారు. యలమంచిలి, కాజ తూర్పు, కట్టుపాలెం గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం జరిగిన పోషకాహార మాసోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలామృతం, చిరు ధాన్యాలు, రాగిపిండితో పోషకాలతో నిండిన ఆహార పదార్థాలకు లను ఏ విధంగా తయారు చేయవచ్చో? ఆమె తల్లులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న శాకంబరి అలంకరణ



చలువపేటలో ఆకట్టుకున్న శాకంబరి వినాయకుడు

**నరసాపురం:** పట్టణంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద గణేష్ నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. 2వ వార్డు చలువపేటలో శుక్రవారం గణేష్ విగ్రహాన్ని కాయగూరలతో అలంకరించారు. ఈ శాకంబరి గణపతిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. భూపతి బాలబాలాజీ, యర్రంశెట్టి సరస్వతీరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు.

### ఏపీబీ, ఏటీబీ ఏజెంట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

**నరసాపురం:** నరసాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ఏపీబీ, ఏటీబీ ఏజెంట్ల నియామకాలకు ధరఖాస్తు చేసుకోవచ్చని నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. నరసాపురం–భీమవరం వయా మత్స్యపురి రూట్, వయా దిగమర్రు, పాలకొల్లు రూట్, నరసాపురం–రాజమండ్రి వయా కవిటం, సిద్దాంతం రూట్, నరసాపరం –మచిలీటపట్టణం వయా మొగల్తూరు, ముత్యాలపల్లి రూట్, నరసాపురం –హైదరాబాద్ వయా అత్తిలి రూట్లో అవకాశాలు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న వారు 99592 25488 నెంబర్కు ఫోన్ చేయాలని సూచించారు.

# పొంగిపొర్లుతున్న డ్రెయిన్లు



వారతిప్పలో ఉధృతంగా ప్రవహిస్తున్న గొంతేరు డ్రెయిన్



ముత్యాలపల్లిలో పొంగి పొర్లుతున్న దర్బరేవు డ్రెయిన్

**మొగల్తూరు:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా, అటు తర్వాత తుఫాన్గా మారడంతో గత నెల 31వ తేదీ నుంచి ఈ నెల 9వ తేదీ వరకు సుమారు 157.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఎగువ ప్రాంతాలలోని వాగులు, వంకలు పొంగి పొర్లడంతో మండలంలోని పలు డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. దీంతో పాటు ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు ఆ నీరంతా దిగువ ప్రాంతాలకు వచ్చి చేరడంతో మండలంలోని దర్బరేవు, గొంతేరు, వెస్ట్ కుక్కిలేరు, మాగిలేరు, గునిపూడి, యనమదుర్రు డ్రెయిన్లలోకి చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దర్బరేవు డ్రెయిన్ పొంగిపొర్లడంతో మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్ప, రామన్నపాలెం పంచాయతీ అడవిపల్లలో వ్యవసాయ భూముల్లో నీరు నిలిచిపోవడంతో సాగు చేపట్టేందుకు రైతులు ఆసక్తి చూపడంలేదు. ఏడాది పొడవునా దర్బరేవు ఆయకట్టు భూముల్లో నీరు నలిచిపోతుండటంతో రెండు పంటలు నష్టపోతున్నారు. మరోవైపు గొంతేరు డ్రెయి పొంగి పొర్లుతుండటంతో మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లి, చింతరేవు, వారతిప్ప, శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లోని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# ఎస్సీ వర్గీకరణను ఆపాలి



పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న మాలల ఐక్యవేదిక నాయకులు

**నరసాపురం:** రాజ్యాంగవిరుద్ధంగా చేపడుతున్న ఎస్సీ వర్గీకరణను వెంటనే ఆపాలని మాలల ఐక్య వేదిక నరసాపురంశాఖ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునరాలోచన చేయాలని కోరుతూ శుక్రవారం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ఇంజేటి జాన్ కెనడీ, కాకిలేటి మధు, అడిదల శరత్ మాట్లాడుతూ సోదరులుగా మసలుతున్న మాల, మాదిగల మధ్య గొడవలు వచ్చే ప్రమాదముందన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలలు దారుణంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ముసూడి రత్నం, గమిడి మధు, పడవల సత్యనారాయణ, పాలపర్తి బోస్, గోరింకల వినోద్, తాడి భరత్ పాల్గొన్నారు.

## పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యా బోధన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి

**పాలకొల్లు అర్బన్:** విద్యార్థుల సామాజిక అవసరాలు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యాబోధన చేస్తే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి సూచించారు. పాలకొల్లు పట్టణంలోని శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ అనుబంధ కళాశాలలలో పనిచేస్తున్న అనుభవజ్ఞులైన అధ్యాపకులతో, వివిధ యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులతో విద్యాబోధనలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యాంశాల రూపకల్పనకు నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. కళాశాల అధ్యాపకులతో రాష్ట్రంలోని పలు కళాశాలలకు చెందిన అధ్యాపకులు ఈ సమావేశంలో పాల్గొని సూచనలు, సలహాలు అందజేశారు.

# ఏచూరికి ఘన నివాళి



పెనుగొండ: ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు





పాలకొల్లు అర్బన్: సీతారాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

**పెనుగొండ:** శ్రామిక వర్గాల కోసం ఎన్నో పోరాటాలు చేసిన నాయకుడు సీతారామ్ ఏచూరి అని మండల కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు కొనియాడారు. శుక్రవారం పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్లో ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో షేక్ పాదుషా, బొల్లోజు నేతాజీ, కడలి చందు, మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**వడలిలో**

వడలి సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో వడలిలో సీతారాం ఏచూరికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తొంటా సత్యనారాయణ, కోమటి సత్యనారాయణ, సీఐటీయూ నాయకుడు ఆవుల శ్రీనివాస రావు పాల్గొన్నారు.

**పాలకొల్లులో..**

**పాలకొల్లు అర్బన్:** కామ్రేడ్ ఏచూరి సీతారాం ప్రపంచ కమ్యూనిస్టు మేధావిగా గుర్తింపు పొందారని పలువురు వక్తలను నివాళులర్పించారు. పట్టణంలోని సమతా భవన్లో శుక్రవారం ఏచూరి సీతారాం సంతాప సభ నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే వామపక్ష ఉద్యమానికి సీతారాం పని చేశారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, సీపీఎం కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, చల్లా సోమేశ్వరరావు, ఎర్ర అజయ్కుమార్, తిరుమల శ్రీనివాసన్, దేవ సుధాకర్, బాబు, లక్ష్మి, సీతామహాలక్ష్మి, తాళాబత్తుల గంగరాజు, తదితరులు సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# వరద బాధితులకు ఆర్థిక సాయం

**పెనుగొండ:** ఆచంట ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో విజయవాడ వరద భాదితులకు రూ.1,1116 చెక్కులను ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు. కొమ్ము చిక్కాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కును అందించారు. కార్యక్రమంలో ఇన్చార్జి తహసీల్దారు సుగుణ సంధ్య, ఛాంబర్ అధ్యక్షుడు కేతా రామకృష్ణ, గణేషుల సుబ్బారావు, చల్లా శ్రీను, నంబూరి రాజా, నంబూరి అంజిబాబు పాల్గొన్నారు.

**భాష్యం స్కూల్ ఆధ్వర్యంలో**

భాష్యం విద్యార్థులు విజయవాడ వరద బాధితులకు రూ.4,80,471 ఆర్థిక సహాయాన్ని అందించినట్లు ప్రిన్సిపాల్ ఎస్వీ అప్పారావు తెలిపారు. శుక్రవారం యాజమాన్యం ద్వారా ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తున్నట్లు వివరించారు.

# పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



వనసంరక్షణ మహోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**వీరవాసరం:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు తెలిపారు. జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్, బృందావన హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో వీరవాసరంలోని ఎంఆర్కె జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ధ్యానశిక్షణ నిర్వహించారు. విద్యార్థులందరికి ఉచితంగా మొక్కల పంపిణీ చేసి, హైస్కూల్ నుంచి లిటిల్ బడ్స్ హైస్కూల్ వరకు వన సంరక్షణ మహోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పచ్చని చెట్లు–ప్రగతికి మెట్లు, పర్యావరణ పరిరక్షణ–మనందరి బాధ్యత, నింగికి చుక్కలు అందం–నేలకు మొక్కలు అందం అనే నినాదాలతో పాటు కరపత్రాలు పంపిణీ చేశారు. వీరవాసరం రైల్వే స్టేషన్ స్టేషన్ సూపరింటెండెంట్ శేఖర్ బాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ అధ్యక్షుడు రుద్రరాజు పెద్దివర్మ, మేకా వెంకటేశ్వరరావు, నవీన్, బి.వసంత, కె.వి.డి.ప్రసాద్, మద్దాల రాంబాబు, కె.మోహన్,సబ్బారపు వెంకటరావు, వర్రి విశ్వేశ్వర రావు, తీడ నాగరాజు, హైస్కూలు హెచ్.ఎం.శ్రీ జె.శ్రీనివాసరావు, డైరక్టర్ కురెళ్ళ నరసింహరావు పాల్గొన్నారు.

# ఘనంగా స్వస్థ్ 2 కె 24 టెక్నికల్ ఫెస్ట్



విద్యార్థులకు మెమెంటో అందజేస్తున్న కొండవేటి సత్యనారాయణ

**నరసాపురం రూరల్:** విద్యార్థుల్లోని సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు ఫెస్టులు ఎంతగానో దోహదపడతాయని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ కొండవేటి సత్యనారాయణ అన్నారు.శుక్రవారం నరసాపురం మండలం సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా స్వస్థ్ 2కె4 పేరుతో జరుగుతున్న ఈసీఈ నేషనల్ లెవెల్ టెక్నికల్ ఫెస్ట్ కార్యక్రమం ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీఈ విభాగం వరుసగా నాలుగు సార్లు ఎన్బీఏ గుర్తింపు పొందిందన్నారు. ఈ సందర్భంగా ఈసీఈ విభాగ సభ్యులందరినీ ఆయన అభినందించారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర ట్రెజరర్ త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, టీవీ ప్రసాద్, ఇన్చార్జి ప్రిన్సిపాల్ గోపీచంద్, ఈసీఈ విభాగాధిపతి సుబ్రహ్మణ్యేశ్వరరావు, అధ్యాపక కోఆర్డినేటర్లు వి.శ్రీనివాస్, ఐవీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణపై అవగాహన



నులిపురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**కాళ్ల:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నులి పురుగుల నివారణ కార్యక్రమంపై మండలస్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యులు సరాబు సునీల్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకొకసారి 1–19 సంవత్సరాల పిల్లలు మందు వాడడం వల్ల నులిపురుగుల నుంచి సంక్రమించే వర్మ్ ఇన్ఫెక్షన్, తద్వారా వచ్చే రక్తహీనత వంటి సమస్యలు రాకుండా చేయవచ్చన్నారు. సెప్టెంబర్ 17న అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మందు పంపిణీ చేస్తామని తెలిపారు. అందుబాటులో లేని వారికి 25నఅందిస్తామన్నారు.

**పాలకోడేరులో..**

**పాలకోడేరు:** ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగుల నివారణ మాత్రలు మింగించి నులి పురుగులను నులిమేద్దామని పాలకోడేరు పీహెచ్సీ వైద్యురాలు స్వర్ణ నిరంజని అన్నారు. పాలకోడేరు మండలం పరిషత్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను ఆవిష్కరించారు.

### రేపు యాదవ విద్యార్థులకు ప్రోత్సాహకాల అందజేత

**పాలకొల్లు అర్బన్:** పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఆవరణలో ఈ నెల ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు యాదవ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో యాదవ విద్యార్థులకు ప్రోత్సహకాలు అందిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ కన్వీనర్ ఆవాల పెద్దిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రోత్సహకాలకు ఎంపికైన విద్యార్థులు తల్లిదండ్రులను తీసుకుని శ్రీ సరస్వతి శిశుమందిర్కి హాజరుకావాలని పెద్దిరాజు కోరారు.

### జేసీ చొరవతో విద్యార్థినికి సర్టిఫికెట్ల అందజేత

**పాలకొల్లు అర్బన్:** పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివిన తనకు ఫీజు బకాయి రూ.5వేలు చెల్లిస్తే గానీ సర్టిఫికెట్లు ఇవ్వనంటున్నారని కరుగోరుమిల్లుకి చెందిన రాయపురెడ్డి జ్ఞానేశ్వరి జాయింట్ కలెక్టర్ రాహుల్కుమార్రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రులో ఓ ప్రైవేట్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి జేసీ రాహుల్కుమార్రెడ్డి శుక్రవారం హాజరయ్యారు. జేసీని జ్ఞానేశ్వరి నేరుగా కలిసి తన సమస్యను వివరించారు. దీంతో జేసీ స్పందించి ఆ పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థికి సర్టిఫికెట్లు ఇప్పించి ఆ విషయాన్ని తనకి చెప్పాలని ఎంఈవో గంగాధరశర్మకి ఆదేశాలిచ్చారు. జేసీ ఆదేశాల మేరకు పాఠశాల యాజమాన్యంతో ఎంఈఓ మాట్లాడి జ్ఞానేశ్వరికి చెందిన సర్టిఫికెట్లను అందజేశారు.

### పోక్సో కేసులో ఆరేళ్ల జైలు

**ఆకివీడు:** స్థానిక మాదివాడకు చెందిన రౌడీ షీటర్ మద్దా సుందర్ సింగ్కు పోక్సో కేసులో ఆరు సంవత్సరాలు జైలు శిక్షను విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి ఎం.ఏ. సోమశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు. 2017 సంవత్సరంలో బాలికపై అత్యాచార సంఘటనపై అప్పటి ఎస్సై సుధాకరరెడ్డి కేసు నమోదు చేశారు. పోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసి పోక్సో కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదాలు అనంతరం శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఎస్ఐ నాగరాజు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున మారిశెట్టి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారని, కోర్టు హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టి సహకరించడంతో కేసు విజయవంతంగా ముగిసిందని చెప్పారు.